సాక్షి
కృష్ణాజిల్లా
బుధవారం ၊ 30 ၊ అక్టోబర్ ၊ 2024



కొండలమ్మ సేవలో కలెక్టర్, ఎస్పీ

గుడ్లవల్లేరు: వేమవరంలో వేంచేసిన శ్రీ కొండలమ్మ అమ్మవారిని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు మంగళవారం రాత్రి దర్శించుకున్నారు.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన ప్రతిపాటి ఆరుష్ వెంకట్ కుటుంబం మంగళవారం రూ.1,00,116 విరాళం సమర్పించింది.



రన్ ఫర్ యూనిటీ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను స్మరించుకుంటూ విజయవాడ డివిజన్‌లో మంగళవారం 'రన్ ఫర్ యూనిటీ' క్యాంపెయిన్ నిర్వహించారు.

న్యూస్‌రీల్

తిరుమలగిరి ఆలయానికి రూ.22.75 లక్షల ఆదాయం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి ఆలయానికి బహిరంగ వేలంలో రూ.22.75 లక్షల ఆదాయం వచ్చిందని ఏసీ వరప్రసాద్ తెలిపారు. ఆలయ ఆవరణలో మంగళవారం పూజా సామగ్రి, పొంగళి షెడ్డు, భక్తులు సమర్పించే పాలు పోగు చేసుకునే హక్కు కోసం బహిరంగ వేలం నిర్వహించారు. పూజా సామగ్రి హక్కుకు రూ.8.05 లక్షలు, పొంగళి షెడ్డుకు రూ.1.10 లక్షలు, భక్తులు సమర్పించిన పాలు, బియ్యం, ఇతర సామగ్రి పోగు చేసుకునే హక్కుకు రూ.13.60 లక్షల ఆదాయం వచ్చింది. గతేడాది కంటే ఈ ఏడాది ఆదాయం పెరిగిందని ఏసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పవన్‌కళ్యాణ్ పాల్గొన్నారు.

సబ్‌జైలును పరిశీలించిన జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శి



గన్నవరం: స్థానిక సబ్‌జైలును జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి కె.వి.రామకృష్ణ మంగళవారం సందర్శించారు. సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలకు కల్పిస్తున్న సదుపాయాలు, బ్యారక్‌లు, వంటశాలలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పాన్ ఇండియా క్యాంపెయిన్‌లో భాగంగా జైళ్లను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జైళ్లలో ఖైదీలకు సదుపాయాలు కల్పించడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. జైలర్ బి.రాంబాబు, ప్యానల్ న్యాయవాది వై.ఆర్.శారద, పీఎల్‌వీ రామినేని రవి తదితరులు పాల్గొన్నారు.

వెలమల సిమ్మన్నకు జ్ఞానజ్యోతి పురస్కారం



ఆచార్య వెలమల సిమ్మన్న

విజయవాడ కల్చరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా భాషవేత్త, పరిశోధకుడు ఆచార్య వెలమల సిమ్మన్నను జాతీయ జ్ఞానజ్యోతి పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ చిల్లర భవానీదేవి, ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 17వ తేదీ సాయంత్రం బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఈ పురస్కారం ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఆచార్య సిమ్మన్న బహుగ్రంథకర్త, శాతాధిక విమర్శనాత్మక రచయిత, ఉత్తమ పరిశోధకుడని వివరించారు. 1994 నుంచి సాహిత్య రంగంలో ఉన్నారని, వివిధ అంశాలపై 60కి పైగా రచనలు చేశారని పేర్కొన్నారు. ఆయన సాహిత్యసేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఎన్నో సంస్థలు పురస్కారాలు ప్రదానం చేశాయని పేర్కొన్నారు. పురస్కారం అందుకుంటున్న సందర్భంలో సిమ్మన్నకు పలు సాహిత్య సంస్థలు అభినందనలు తెలిపాయి.

ఈవీఎం గోడౌన్ తనిఖీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎం గోడౌన్‌ను ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా మంగళవారం తనిఖీ చేశారు. ఈవీఎంలను భద్రపరిచిన జిల్లా ఎలక్షన్ గోడౌన్‌కు వేసిన సీలు, ఈవీఎంల రక్షణకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పని తీరును పరిశీలించారు. అనంతరం ఈవీఎం గోడౌన్ పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోడౌన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉంటుందన్నారు. ఈవీఎం గోడౌన్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ గార్డ్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ వి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ డీటీ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలే నిర్ణేతలు

- ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల
- జిల్లాలో మొత్తం 15,38,937 మంది ఓటర్లు
- పురుషులు 7,45,774 మంది, మహిళలు 7,93,108 మంది
- 2024 జనవరి 22 తుది జాబితా ప్రకారం 15,18,255 మంది
- నాలుగు నియోజకవర్గాల్లో రెండు లక్షలకు పైగా ఓటర్లు



చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల సంక్షిప్త సవరణ కార్యక్రమానికి సంబంధించి ఓటర్ల ముసాయిదా జాబితాను అధికారులు మంగళవారం విడుదల చేశారు. ఈ ముసాయిదా జాబితా ప్రకారం ఓటర్లలో మహిళలే ఎక్కువ మంది ఉన్నారు. ఈ జాబితా ప్రకారం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య జనవరిలో విడుదలైన తుది జాబితా కంటే పెరిగింది. 2024 జనవరి తుది జాబితా ప్రకారం జిల్లా వ్యాప్తంగా 15,18,255 మంది ఓటర్లు ఉండగా వారిలో 7,37,394 మంది పురుషులు, 7,80,796 మంది మహిళలు, ఇతరులు 65 మంది. ప్రస్తుతం విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 15,38,937 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 7,45,774 మంది, మహిళలు 7,93,108 మంది, ఇతరులు 55 మంది.

జిల్లాలో పెరిగిన ఓటర్లు 20,682 మంది

2024 జనవరి 22వ తేదీన ప్రకటించిన తుది జాబితాలో 15,18,255 మంది ఓటర్లు ఉండగా 2024 మంగళవారం ప్రకటించిన ముసాయిదా ప్రకారం 15,38,937 మంది ఓటర్లు ఉన్నారు. ఈ రెండింటికి పోల్చి చూస్తే 20,682 మంది ఓటర్లు పెరిగారు. జిల్లాలో జనాభా లెక్కల ప్రకారం 18 నుంచి 19 సంవత్సరాల్లోపు వయసు ఉన్న 18,048 మంది మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. మరో 21,802 మంది ఓటర్లుగా నమోదు కావాల్సి ఉంది. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 18 నుంచి 21 సంవత్సరాల వయసు ఉన్న ఓటరుగా నమోదు కాకుండా ఏ ఒక్కరూ ఉండకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నవంబర్ 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు దినాలుగా కేటాయించారు. ఈ తేదీల్లో బూత్ లెవల్ అధికారి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల జాబితాతో పాటు ఫారం -6, 7, 8లతో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారు. దీంతో పాటు సిస్టమ్యాటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కుపై అవగాహన, ఓటరుగా నమోదు కార్యక్రమాలను జిల్లా, అసెంబ్లీ, మండల, మునిసిపాలిటీ, గ్రామ, బూత్ స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఓటు నమోదు శాతాన్ని పెంచేందుకు అన్ని కళాశాలలు, యూనివర్సిటీల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 2024 నవంబరు 28వ తేదీ వరకు ఓటరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. 2025 జనవరి 6వ తేదీన ఓటర్ల తుది జాబితాను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

నియోజకవర్గం	2024 జనవరి తుది జాబితాలో ఓటర్ల సంఖ్య	2024 అక్టోబర్ ముసాయిదా జాబితాలో..	2024 అక్టోబర్ ముసాయిదా జాబితాలో పురుషుల సంఖ్య	2024 అక్టోబర్ ముసాయిదా జాబితాలో మహిళల సంఖ్య	2024 అక్టోబరు ముసాయిదాలో ఇతరులు
గన్నవరం	2,77,323	2,79,307	1,34,354	1,44,941	12
గుడివాడ	2,00,786	2,04,490	97,827	1,06,652	11
పెడన	1,65,770	1,67,239	82,817	84,422	0
మచిలీపట్నం	1,93,574	1,96,608	94,754	1,01,843	11
అవనిగడ్డ	2,10,965	2,12,103	1,04,457	1,07,630	16
పామర్రు	1,83,158	1,84,421	89,307	95,111	3
పెనమలూరు	2,86,679	2,94,769	1,42,258	1,52,509	2
మొత్తం	15,18,255	15,38,937	7,45,774	7,93,108	55

లేత వయసుకు ఊబగాయం

- ఆహారపు అలవాట్లతో బాల్యంలోనే స్థూలకాయం
- పిల్లల్లో ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్న వైనం
- 10–12 ఏళ్ల మధ్య వయస్సులోనే ప్రీ డయాబెటీస్
- అప్రమత్తం కావాలని వైద్యుల హెచ్చరిక



లబ్బీపేట(విజయవాడతూర్పు): బాల్యం స్థూలకాయం బారిన పడుతోంది. 10 నుంచి 12 ఏళ్ల మధ్య వయస్సు పిల్లలు ప్రతి ముగ్గురిలో ఒకరు ఊబకాయం(ఒబెసిటీ)తో పాటు, ప్రీ డయాబెటీస్ స్టేజ్‌లో ఉన్నట్లు జాతీయ ఆరోగ్య సంస్థల నివేదికలు పేర్కొంటున్నాయి. దేశంలోనే అత్యంత వేగంగా ఊబకాయులుగా మారుతున్న ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ కూడా ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో మరింత మంది ఊబకాయులుగా మారడంతో పాటు మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

క్రీడలకు ప్రాధాన్యం లేక..

ఒకప్పుడు ప్రతి పాఠశాలలో క్రీడా ప్రాంగణం ఉండేది. కొంత సమయం క్రీడలకు కేటాయించే వారు. ఇప్పుడు 90 శాతం పాఠశాలలకు క్రీడా మైదానాలే లేని పరిస్థితి ఉంది. ఆటలకు దూరం పెట్టడం, శ్రమ లేకుండా చేయడంతో పిల్లల్లో ఊబకాయం పెరిగిపోతోంది. ఒకప్పుడు చిన్నారులు పాఠశాలకు సైకిళ్లపై వెళ్లేవారు. ఇప్పుడు సైకిల్ వినియోగించే పిల్లలు చాలా తక్కువ. ఎల్‌కేజీ నుంచి ఏసీ తరగతి గదులు ఏర్పాటు చేస్తున్నారు. ఆటలకు దూరం కావడం వల్ల ఊబకాయంతో పాటు, తీవ్రమైన వత్తిడి, డిప్రెషన్‌కు గురవుతూ మొండిగా మారుతున్నారు. గతంలో పిల్లలు బడి నుంచి ఇంటికి రాగానే కాసేపు ఆటలు ఆడుకునే వారు. ఇప్పుడు ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ తరగతి గదిలోనే గడుపుతున్నారు. ఇంటికి రాగానే కంప్యూటర్లపై మళ్లీ ఆన్‌లైన్ హోమ్ వర్క్ చేయిస్తున్నారు. పిల్లలు కూడా కాసేపు సమయం దొరికితే ఐప్యాడ్, స్మార్ట్ ఫోన్‌లతో కాలక్షేపం చేస్తూ శ్రమలేని జీవనానికి అలవాటుపడుతున్నారు. ఇలా ఉదయం నుంచి రాత్రి వరకూ కాసేపు కూడా పిల్లలకు శారీరక శ్రమ ఉండటం లేదు.

ఏమి చేయాలంటే..

- ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి.
- పళ్లు, కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తినాలి.
- స్కూలు పనులు, ఇంటి పనుల్లో పిల్లలు భాగస్వాములు కావాలి.
- పాఠశాలలో చదివే సమయంలో తప్పనిసరిగా క్రీడల్లో పాల్గొనాలి.
- లిఫ్టును పక్కన పెట్టి మెట్ల మార్గంలోనే పై అంతస్తులకు చేరుకోవాలి.
- భోజనం చేసేటప్పుడు టీవీ, కంప్యూటర్ చూడటం మానుకోవాలి.
- ప్రతి రోజూ కనీసం 30 నిమిషాల పాటు పిల్లలతో వ్యాయామం చేయించాలి.

దుష్ఫలితాలు ఇవీ..

- పిల్లల్లో ఊబకాయం ప్రీ డయాబెటీస్‌కు దారి తీస్తుంది.
- వయస్సు 20 ఏళ్లు వచ్చే నాటికే రక్తపోటు, మధుమేహం బారిన పడుతున్నారు.
- 25 ఏళ్లు వారిలో వచ్చే బ్రెయిన్‌స్ట్రోక్‌కు నిశ్చల జీవనశైలి, ఊబకాయం కారణంగా ఉంది.
- ఊబకాయుల్లో కిడ్నీ, గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువ.
- ఊబకాయం ఉన్న పిల్లలు తోటి పిల్లల నుంచి అవమానాలకు గురయ్యే అవకాశం ఉంది.
- క్రీడల్లో చురుగ్గా పాల్గొనలేరు.

పెరుగుతున్న ప్రీ డయాబెటీస్ కేసులు



ఒకప్పుడు టైప్–1 డయాబెటీస్ ప్రతి పది వేల మంది చిన్నారుల్లో ఇద్దరికి ఉండేది. ప్రస్తుతం ఊబకాయం కారణంగా ఎక్కువ శాతం పిల్లలు ప్రీ డయాబెటీస్‌కు గురవుతున్నారు. మేలుకోక పోతే రానున్న కాలంలో ప్రమాదకర స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది. రెస్టారెంట్లకు వెళ్లడం తగ్గించాలి. జంక్‌ఫుడ్ వంటివి స్కూల్ క్యాంటీన్‌లో, పరిసర ప్రాంతాల్లో అందుబాటులో లేకుండా చూడటంతో పాటు, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచాలి. పిల్లల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు ఊబకాయులుగా మారుతుండగా, 80 శాతం మందికి శారీరక శ్రమ ఉండటం లేదు.

– డాక్టర్ ఎం.శ్రీకాంత్, మధుమేహ నిపుణులు

185 మందికి ఉద్యోగ నియామకపత్రాలు



నియామకపత్రం ఇస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దేశ నిర్మాణంలో యువశక్తికి ప్రధాని నరేంద్రమోదీ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, రోజ్‌గార్ మేళా ద్వారా లక్షల మందికి కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే అందుకు నిదర్శనమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. తపాలశాఖ ఆధ్వర్యంలో విజయవాడ రైల్వే ఆడిటోరియంలో మంగళవారం రోజ్‌గార్ మేళా నిర్వహించారు. ముఖ్య అతిథి శివనాథ్ మాట్లాడుతూ.. యువత సాధికారత దిశగా వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రధాని కృషిచేస్తున్నారని చెప్పారు. దేశ వ్యాప్తంగా 40 ప్రాంతాల్లో నిర్వహించిన రోజ్‌గార్ మేళా ద్వారా 51 వేల మందికి ప్రధాని ఢిల్లీ నుంచి వర్చువల్‌గా నియామకపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. విజయవాడ డివిజన్ పరిధిలో 185 మందికి నియామకపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే బొండా ఉమా, డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్, ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.ప్రకాష్, రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ డి.ఎస్.వి.ఆర్.మూర్తి, బీఎస్ఎన్ఎల్ సీజీఎం శేషాచలం తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ బాదుడు

ఇక రీచార్జ్ చేస్తేనే విద్యుత్ సరఫరా

- విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- తొలిగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు
- రీచార్జి పరిమితి ముగిసిన వెంటనే సరఫరా నిలిపివేత
- ఇళ్లలోనూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు



గుడ్లవల్లేరు: విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం స్మార్ట్‌గా భారం మోపుతోంది. విద్యుత్ మొండి బకాయిలకు చెక్ పెట్టేందుకు అంటూ వినియోగదారులను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతోంది. విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. తొలిగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ మీటర్లను బిగిస్తున్నారు. ప్రస్తుతం విద్యుత్ వాడకాన్ని యూనిట్లలో లెక్క గట్టి వినియోగదారులకు బిల్లులు జారీ చేస్తారు. ఆ బిల్లు మొత్తాన్ని వినియోగదారులు గడువు లోపు చెల్లిస్తారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటైన తరువాత డబ్బులు ముందుగా (ప్రీ పెయిడ్) చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా అవుతుంది. ప్రస్తుతం మన సెల్ ఫోనులకు ప్రీ పెయిడ్ రీచార్జి చేసినట్లే విద్యుత్‌ను కూడా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. రీచార్జి చేసిన నగదుకు సరిపడా విద్యుత్‌ను నిర్ణీత గడువుకు ముందుగానే వాడితే సరఫరా నిలిచిపోతుంది. బ్యాలెన్స్ అయిపోయిన వెంటనే రీచార్జ్ చేసుకోకపోతే ఇంటిల్లిపాదీ చీకట్లో మగ్గాల్సిందే.

కేంద్ర మార్గదర్శకాల మేరకు..

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. త్వరలో అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లను అమర్చేందుకు నిర్ణయం తీసుకుంది. ముందస్తుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రారంభించింది. 2025 జనవరి నాటికి అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లను అమర్చే లక్ష్యంతో అధికార యంత్రాంగం అడుగులు వేస్తోంది. ఈ నూతన విధానం ద్వారా ప్రీపెయిడ్ మీటర్లకు ముందుగానే రీచార్జ్ చేయవలసి ఉంటుంది. అలా చేయకపోతే సరఫరా ఆటోమేటిక్‌గా కట్ అయిపోతుంది. ఇప్పటి వరకు అమలవుతున్న విధానానికి అలవాటు పడిన వినియోగదారులపై కొత్త విధానం ఆర్థికంగా భారం పడుతుంది. కృష్ణాజిల్లాలో విద్యుత్ కనెక్షన్లు 6.40 లక్షలు ఉన్నాయి. వాటిలో గృహ విద్యుత్ కనెక్షన్ల సంఖ్య 5.36 లక్షలు. ఇవన్నీ దశల వారీగా ప్రీపెయిడ్ కనెక్షన్లుగా మారనున్నాయి.

ప్రస్తుతం ఇదీ పరిస్థితి

ప్రస్తుతం ఈ నెలకు వినియోగించిన విద్యుత్ బిల్లును మరుసటి నెల చెల్లిస్తున్నాం. బిల్లు పొందిన 15 రోజుల వరకు అపరాధ రుసుం ఉండదు. అపరాధ రుసుంతో మరో 15 రోజుల్లో బిల్లు చెల్లించడానికి సమయం ఉంటుంది. ఈ లెక్కన వినియోగదారుడికి బిల్లు చెల్లించడానికి నెల వరకు గడువు ఉంటుంది. ఇక నుంచి బిల్లులు ముందుగా చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా అవుతుంది. మనం ముందుగా చెల్లించిన బిల్లు మేరకు విద్యుత్‌ను నెలకు ముందుగా వాడితే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. మళ్లీ రీచార్జి చేస్తేనే విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు నోచుకుంటుంది.



స్మార్ట్ మీటర్

బకాయిల బెడద తగ్గుతుంది



అనవసరపు విద్యుత్ వినియోగాన్ని తగ్గించేదుకే నూతన ప్రీపెయిడ్ విధానంతో స్మార్ట్ మీటర్లను ప్రవేశ పెడుతున్నారు. దీని వల్ల బిల్లు చెల్లింపుపై వినియోగదారులకు బాధ్యత పెరుగుతుంది. రీచార్జ్ చేస్తేనే కరెంట్ వినియోగించుకునే అవకాశం ఉండటం వల్ల మొండి బకాయిల బెడద తగ్గుతుంది. ముందుగా ప్రభుత్వ కార్యాలయాల్లో ట్రయల్ రన్‌గా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేస్తున్నారు.

– ఎల్.గోవింద్, విద్యుత్ జేఈ

మందు.. గమ్మత్తు



రోగాలను నయం చేసే మందు.. మత్తులో ముంచెత్తే మద్యం పక్కపక్కనే లభిస్తున్నాయి. విజయవాడ బందరు రోడ్డులో స్వీట్ మ్యాజిక్ ఎదురుగా మందుల షాపు, మద్యం షాపు ఇలా పక్కపక్కనే ఉన్నాయి. ఈ మార్గంలో వెళ్లే వారు ఈ షాపులను ఆసక్తిగా తిలకిస్తున్నారు. రెండూ 'మందు' షాపులే కదా అని సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు.

– ఆటోనగర్(విజయవాడతూర్పు)

దేవదాయ శాఖ మంత్రికి ఎన్ఎంఆర్‌ల వినతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో దీర్ఘకాలంగా వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఎన్ఎంఆర్‌లను రెగ్యులర్ చేయాలని మంగళవారం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆలయ సిబ్బంది వినతిపత్రం సమర్పించారు. దుర్గగుడికి విచ్చేసిన మంత్రి రామనారాయణ రెడ్డిని ఎన్ఎంఆర్ ఉద్యోగులందరూ కలిసి తమ గోడును చెప్పుకున్నారు. ఎన్ఎంఆర్‌లు (బేసిస్‌పే విధానంలో)గా ఎన్నో దశాబ్దాల నుంచి విధులు నిర్వహిస్తున్నామని, గతంలో కొంత మంది ఎన్ఎంఆర్‌లు కోర్టు ఉత్తర్వుల ప్రకారం రెగ్యులర్ చేయించుకున్నారని పేర్కొన్నారు. తమను రెగ్యులర్ చేయాలని వినవించుకున్నారు. దీనిపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్ఎంఆర్‌లకు సంబంధించి రికార్డులను దేవస్థాన కార్యాలయం నుంచి తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

వడ్డీతో వైద్య బీమా మొత్తాన్ని చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారునికి వడ్డీతో వైద్యబీమా మొత్తాన్ని చెల్లించాలని విని యోగదారుల కమిషన్ అధ్యక్షుడు నందిపాటి పద్మారెడ్డి, సభ్యురాలు శ్రీలక్ష్మీరాయల మంగళ వారం తీర్పు చెప్పారు. గుడివాడ పట్టణానికి చెందిన సురేష్‌కుమార్ జైన్ ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీలో 2015వ సంవత్సరం లో హెల్త్ పాలసీని తనకు, తన కుటుంబ సభ్యుల కోసం తీసుకున్నారు. 2022వ సంవ త్సరంలో సురేష్‌కుమార్ జైన్ కోడలికి ఫైబ్రాయిడ్ రిమూవల్ ఆపరేషన్ జరగటంతో రూ.1,04,870 ఖర్చు అయింది. క్లయిమ్ కోసం ఇన్సూరెన్స్ కంపెనీని సంప్రదిస్తే ఈ ఆపరేషన్‌కు క్లయిమ్ రాదని నిరాకరించారు. దీంతో ఆయన వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పూర్వాపరాలు విచారించిన అనంతరం కమిషన్ సభ్యులు 2022 అక్టోబరు 26వ తేదీ నుంచి 9 శాతం వడ్డీతో క్లయిమ్ మొత్తాన్ని చెల్లించాలని, మానసిక వేదన కలి గించినందుకు రూ.30 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు తీర్పు వెలువడిన 30 రోజుల్లో చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

కాలువలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య



కంకిపాడు: కాలువలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళ వారం కేసు నమోదైంది. అదనపు ఎస్‌ఐ డి.తాతా చార్యులు తెలిపిన కథనం మేరకు...మండలం లోని గొడవర్రు గ్రామానికి చెందిన ఉప్పులేటి మేరీ గ్రేస్ (70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. అనారోగ్యం బాధ తాళలేక కంకిపాడు లాకులు సమీపంలోని బందరు కాలువ రేవులోకి దిగి ఆత్మహత్య చేసుకుంది. మృతదేహం బందరు కాలువకు అనుబంధంగా ఉన్న వల్లూరు పడమట కాలువ లాకుగేట్లు వద్ద ఇరుక్కుపోవటంతో స్థానికులు గుర్తించి పోలీసులు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. తహసీల్దార్ వి.భావన్నారాయణ పర్యవేక్షణలో సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తాతాచార్యులు తెలిపారు.

నాలుగు వికెట్ల తేడాతో ఆంధ్రా జట్టు విజయం



విజయవాడస్పోర్ట్స్: కల్నల్ సి.కె.నాయుడు మల్టీ డే మ్యాచ్‌లో ఆంధ్రా విజయం సాధించింది. మూలపాడులోని ఏసీఏ మైదానంలో మూడు రోజుల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రత్యర్థి విదర్భ జట్టుపై నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్రా జట్టు 63 పరుగులు చేయాల్సి ఉంది. ఈ లక్ష్యాన్ని మంగళ వారం ఉదయమే ఛేదించి విజేతగా నిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆంధ్రా బ్యాట్స్‌మెన్‌లు జి.ఎస్.పి.తేజ 58(నాటౌట్), సుబ్రహ్మణ్యం 30 పరుగులు చేశారు.

నత్తనడకన పక్కా ఇళ్ల నిర్మాణం

- జిల్లాలో 25 మండలాల్లో నలుగురే ఏఈలు
- ఏఈల రిక్రూట్‌మెంట్ లేనట్లే...
- ఏఈల స్థానంలో ఇన్‌చార్జిలుగా సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు
- అధికారుల కొరతతో పని భారం



చతికిలబడ్డ పక్కా ఇళ్ల నిర్మాణాలు



గుడ్లవల్లేరులోని ఓ కాలనీలో రోడ్డు దుస్థితి ఇది

గుడ్లవల్లేరు: జిల్లాలో పక్కా ఇళ్ల నిర్మాణం నత్తకు నడక నేర్పుతున్న చందంగా ఉంది. కేవలం హౌసింగ్ ఏఈల రిక్రూట్‌మెంట్ లేకపోవటంతో ఈ దుస్థితి నెలకొంది. జిల్లాలోని 25 మండలాల్లో ఒక్కొక్కరూ రిటైర్ అవుతూ చివరకు ఇప్పుడు నలుగురు ఏఈలే మిగిలారు. ఆ ఖాళీల్లో గ్రామ సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లను, గృహ నిర్మాణ శాఖలో సీనియర్ వర్క్ ఇన్‌స్పెక్టర్లను ఏఈల స్థానే ఇన్‌చార్జిలుగా నియమించింది. దీంతో వారికి అదనపు పని భారం అయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 86 వేల పక్కా ఇళ్లకు పైగా మంజూరయ్యాయి. ఆ ఇళ్ల నిర్మాణాలకు బిల్లులను వచ్చే ఏడాది మార్చి లోగా లబ్ధిదారులకు అందించవలసి ఉంది. ఏఈల కొరతతో ఈ ప్రక్రియ జఠిలమైంది. ఆ స్థానాల్లో నియమించిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు ఈ ప్రక్రియ పని భారంగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పడ్డ జగనన్న కాలనీల్లో రోడ్లు, మంచినీటి వంటి మౌలిక వసతులను కల్పించే నాథుడే కరువయ్యాడు. కూటమి ప్రభుత్వం డిసెంబరు నుంచి నిర్మించనున్న పక్కా ఇళ్ల నిర్మాణాలకు కూడా ఏఈల కొరత ఉంది. నూతనంగా ఆయా ఖాళీల్లో పని చేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ల పైనే ఈ భారం కూడా పడనుంది. తమ శాఖలో ఏఈల కొరత ఉన్న మాట వాస్తవమేనని జిల్లా హౌసింగ్ పీడీ ఎస్.వెంకట్రావు స్పష్టం చేశారు. రిక్రూట్‌మెంట్ లేకనే ఏఈల పోస్టులు ఖాళీ అయిన మండలాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో పని చేయించుకుంటున్నామని చెప్పారు.

బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన కేకేఆర్ విద్యార్థి



గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్

గుడివాడ రూరల్: ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామంలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ అండర్-17 బాస్కెట్ బాల్ పోటీల్లో కృష్ణాజిల్లా జట్టు తరఫున ఆడిన తమ విద్యార్థిని జి.ప్రణతి గోల్డ్‌మెడల్ సాధించినట్లు గుడివాడ డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని జి.ప్రణతి, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కోచ్ మడక సత్యఅన్వేష్‌లను పాఠశాల ఆవరణలో జరిగిన అభినందన సభలో ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి అభినందించినట్లు ఆయన తెలిపారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- బాణసంచా దుకాణాలకు లైసెన్స్‌లు తప్పనిసరి
- డెకాయిట్‌ల కదలికలపై నిరంతరం నిఘా
- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు
- నేర సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

కోనేరుసెంటర్: జిల్లాలో నేరాల నియంత్రణకు మరింత కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు అధ్యక్షతన జరిగిన నేరసమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. దీపావళి పండుగను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి అగ్ని ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రౌడీలు, కేడీలు, డెకాయిట్‌లపై నిరంతరం నిఘా పెంచాలన్నారు. జైలు నుంచి విడుదల అయిన పాత నేరస్తుల కదలికలను గమనిస్తూ ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలోని వ్యాపార సముదాయాలలో, ప్రార్థనా మందిరాలలో, ప్రముఖుల విగ్రహాల వద్ద, హాస్పిటల్స్ వద్ద, ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. 60 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్స్ పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు, వృద్ధులను పట్టించుకోని పిల్లలు తల్లిదండ్రులకు ప్రతి నెలా 10,000 ఇచ్చేలా చట్టాలు వచ్చాయన్నారు. మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్ -2007 ప్రకారం ఇది అమలు జరిగేలా చూడాలన్నారు. ఎవరైనా భరణం ఇవ్వడానికి నిరాకరిస్తే కోర్టు నిర్ణయం ప్రకారం జరిమానా, జైలు శిక్ష వేసే అవకాశం ఉందని, దీనిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు.

జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు మాట్లాడుతూ మహిళలు, పిల్లల సంబంధిత నేరాల విషయంలో పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. త్వరితగతిన విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పిల్లలకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి తెలియజేయాలన్నారు. జిల్లాని గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి కృషి చేయాలన్నారు. దొంగతనాలు జరగకుండా నైట్ బీట్ సంఖ్యను పెంచాలన్నారు. రహదారి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున జిల్లాలో ప్రత్యేక సైబర్ క్రైమ్ టీం ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసులకు సంబంధించి సమీక్ష జరిపి కేసుల దర్యాప్తు వివరాలు చార్జిషీట్ దాఖలు, ప్రస్తుతం కోర్టులో విచారణ ఏ దశలో ఉన్నాయి వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, బందరు, అవనిగడ్డ డీఎస్పీలు అబ్దుల్ సుభాన్, పి.మురళీధర్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాల కల్పనకే నైపుణ్య గణన



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్య గణన ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో మంగళవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యువతకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్వే నిర్వహించనున్నారు. ప్రతి మండలం నుంచి ఇద్దరు సచివాలయ సిబ్బందిని ఎంపిక చేసి మండలస్థాయిలో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పొందిన సచివాలయ సిబ్బంది వారి పరిధిలోని మిగిలిన సిబ్బందికి శిక్షణ ఇస్తారన్నారు. జిల్లాలోని ఇంజినీరింగ్, మెడికల్, ఫార్మసీ, డిప్లొమో కళాశాలలను గుర్తించి విద్యార్థులకు నైపుణ్య గణన ప్రాముఖ్యత గురించి వివరించాలన్నారు. సర్వేలో ప్రధానంగా విద్యార్హతలు, నైపుణ్యాలు, ప్రస్తుత ఉపాధి వివరాలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులు, ఆకాంక్షలు ప్రశ్నల ద్వారా ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా సమాచారాన్ని సేకరించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి 15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి ఒక్కరి డేటా సేకరించాలని, దీనిపై ఎవరికి సందేహాలు ఉన్నా నివృత్తి చేసి ఉపయోగాలను ఓపికగా వివరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో బాణసంచా దుకాణాల పరిశీలన



బాణసంచా దుకాణ నిర్వాహకులు, అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

గుడివాడరూరల్: పట్టణంలోని దొండపాడు కాల్వ వద్ద ఏర్పాటు చేయనున్న బాణసంచా దుకాణాలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఎస్పీ ఆర్.గంగాధరరావుతో కలసి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. బాణసంచా దుకాణాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అగ్ని ప్రమాదాలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ బాణసంచా దుకాణాల వద్ద అవాంఛనీయ సంఘటన జరిగితే వెంటనే స్పందించి అత్యవసరంగా ప్రమాదాలు నివారించేందుకు తగిన నీటి వనరులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సమీపంలో కాల్వ ఉండటంతో ఫైర్ ఇంజన్‌తో నీటి సరఫరా డెమోను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా ఫైర్ అధికారి ఏసురత్నం, వన్ టౌన్, టూటౌన్, తాలూకా సీఐలు కొండపల్లి శ్రీనివాస్, చిన్ని నాగప్రసాద్, ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు, ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, గుడివాడ ఫైర్ అధికారి జె.ఆంజనేయులు, తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు, ఫైర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టైలర్ దుర్మరణం

విజయవాడస్పోర్ట్స్: రాణిగారితోట వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో టైలర్ పి.శివశంకర్(50) అక్కడికక్కడే మృతిచెందాడు. నగరంలోని మొగల్రాజపురానికి చెందిన శివశంకర్ రాణిగారితోట చలసానినగర్‌లో ఓ టైలరింగ్ షాపులో పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసేందుకు హైవే పక్కనే ఉన్న అన్నా క్యాంటీన్‌కు వెళ్లి తిరిగి వస్తూ నేతాజీ వంతెన వద్ద హైవే దాటుతుండగా మదనపల్లి నుంచి వారధి మీదుగా టమాటా లోడుతో ఒడిశా వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. శివశంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఐదో ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ బాలమురళీకృష్ణ తెలిపారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర బాక్సింగ్ చాంపియన్‌షిప్



బాక్సింగ్ రాష్ట్ర పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-19 బాక్సింగ్ పోటీలు మంగళవారం ముగిశాయి. కృష్ణలంకలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా వికాస కేంద్రంలో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరిగాయి. బాలికల 45 కేజీల లోపు బరువు విభాగంలో లక్ష్మి(చిత్తూరు), హేమావతి(అనంతపురం), 45-48 విభాగంలో నిహారిక (విశాఖ), యోగితాకుమారి(తూర్పు గోదావరి), 48-51లో సింధు (తూర్పు గోదావరి), శ్రీనవ్య (విశాఖ), 51-54లో అనిత(విశాఖ), అక్షిత (తూర్పు గోదావరి), 54-57లో పల్లవి (విశాఖ), వైజయంతి(నెల్లూరు), 57-60లో లిఖిత (విశాఖ), రాణి (తూర్పుగోదావరి),60-64లో అమృతమయి (గుంటూరు), కీర్తన (నెల్లూరు), 64-66లో శివాని (విశాఖ), అమూల్య (నెల్లూరు), 66-69లో నవ్యశ్రీరెడ్డి (విశాఖ), కృష్ణమ్మ (కర్నూలు), 69-75లో మహి (కృష్ణా), శిరీష(గుంటూరు), 75-81లో నందినిశ్రీ(విశాఖ), తేజస్విని (గుంటూరు), 81 కేజీల బరువు పైబడిన విభాగంలో యశ్విత (విశాఖ), జాహ్నవి (కర్నూలు), బాలుర 46 కేజీల బరువు విభాగంలో అభిషేక్(గుంటూరు), సుభాష్(చిత్తూరు), 46-49 విభాగంలో దినేష్‌కుమార్ (విశాఖ), లీలాకృష్ణ (విజయనగరం), 49-52లో చరణ్‌మోహన్ (విశాఖ), చరణ్‌రెడ్డి(గుంటూరు), 52-56లో కిరణ్ (విశాఖ), దుర్గారావు(విజయనగరం), 56-60లో హరీష్ (విశాఖ), సాయిసాగర్ (నెల్లూరు), 60-64లో కృష్ణకుమార్(విశాఖ), కౌశిక్ (కృష్ణా), 64-69లో సాయికుమార్‌రెడ్డి (విశాఖ), గోపి(గుంటూరు), 69-75లో అనిరుధ్ బాలాజీ (కృష్ణా), హేమంత్‌రెడ్డి(చిత్తూరు), 75-81లో బాలకుమార్(విజయనగరం), జశ్వంత్ (నెల్లూరు), 81-91లో సూర్యతేజ (విజయనగరం), హరీష్ (శ్రీకాకుళం), 91 కేజీల బరువు పైబడిన విభాగంలో హరిన్ (విశాఖ), వెంకటమనోజ్ (నెల్లూరు) వరుసగా గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందుకున్నారు. విజేతలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు, కృష్ణాజిల్లా కార్యదర్శి వి.రవికాంత, పోటీల పరిశీలకులు లక్ష్మణ్ బహుమతులు అందజేశారు.

ఆరోగ్య సమస్యలపై నిర్లక్ష్యం తగదు

జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు



రక్తదానం చేస్తున్న పోలీసు అధికారులను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

కోనేరుసెంటర్: ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్య సమస్యలపై నిర్లక్ష్యం తగదని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు పోలీసు సిబ్బందిని హెచ్చరించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా మంగళవారం పోలీసు కల్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎస్పీ మాట్లాడుతూ పోలీసు వృత్తి కత్తి మీద సాములాంటిదన్నారు. సర్వీసులో చేరిన నాటి నుంచి ఉద్యోగ విరమణ చేసే వరకు అనేక వత్తిళ్లను తట్టుకోవాల్సివస్తుందన్నారు. అలాంటి సందర్భాల్లో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలపై సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని, చిన్నపాటి నిర్లక్ష్యం మనిషి ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తుందని అన్నారు. పోలీసులు ఎప్పటికప్పుడు తమ ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటూ జాగ్రత్తగా ఉండాలన్నారు. విధులతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవటం, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని చెప్పారు. సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజసేవలో తమ వంతు పాత్ర పోషించటం అభినందనీయమన్నారు. పోలీసులు శాంతిభద్రతలను కాపాడుతూనే సమాజసేవలోనూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్‌బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.రాజశేఖర్, పోలీస్ వెల్ఫేర్ ఆసుపత్రి వైద్యుడు కృష్ణవంశీ, సీఐలు, ఎస్ఐలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.